జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

NIZAMABAD EDITION

నిజామాబాద్ | ఆదివారం 17 మే 2026 | సంపుటి : 16 | సంచిక : 103 | పేజీలు : 8 | వెల : 1/- | RNI No. TELTEL/2010/35558

విక్రం సంవత్సరం – పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ – 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా – 2081, ఆషాఢము 16 అమాంత – 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from NIZAMABAD, WARANGAL, RANGAREDDY, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండలం రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528

## ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలి

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



శనివారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, అదనపు కలెక్టర్ విక్టర్, సంబంధిత అధికారులు, తదితరులు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం అమలుకు కార్యాచరణ విడుదల చేసిందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా జూన్ 15 నుంచి 24 వరకు సంబంధిత సిబ్బంది, అధికారులకు శిక్షణ, ఎన్యూమరేషన్ ఫారాల ముద్రణ తదితర ఏర్పాట్లు చేపట్టనున్నట్లు చెప్పారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటికి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసి, తిరిగి సేకరించే ప్రక్రియ నిర్వహిస్తారని తెలిపారు.

4

## రామేశ్వరపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో ఉద్రిక్త పరిస్థితులు





మూడు రోజులుగా కొనసాగుతున్న గొడవలు..

దేవునిపల్లి పోలీసుల నిర్లక్ష్యంపై కాలనీవాసుల ఆగ్రహం

"ప్రాణాలు పోతే గానీ చర్యలు తీసుకోరా?" అంటూ పోలీసులను నిలదీసిన బాధితులు

5

## ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యం...

## రోడ్డెక్కిన రైతన్నలు



జాతీయ రహదారిపై రాస్తారోకో.....

మిల్లర్ల దోపిడీని అరికట్టాలని డిమాండ్...

3



# ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యం...రోడ్డెక్కిన రైతన్నలు

## జాతీయ రహదారిపై రాస్తారోకో.....
## మిల్లర్ల దోపిడీని అరికట్టాలని డిమాండ్...

**నాగిరెడ్డిపేట్,మే16(ప్రజాజ్యోతి):** ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం అమ్ముకోవడానికి అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. నాగిరెడ్డిపేట్ మండలంలోని మాల్తుమ్మెద గ్రామంలో పంటలు కోసి ధాన్యాన్ని కోనుగోలు కేంద్రానికి తెచ్చి నెలలు గడుస్తున్న ధాన్యం కొనుగోలు చేయడంలో ఆలస్యం జరుగుతుండటంతో ఆగ్రహించిన రైతులు జాతీయ రహదారిపై రోడ్డెక్కి రాస్తారోకో చేసి నిరసన వ్యక్తం చేశారు.రైతులు రహదారి పై బైఠాయించడంతో వాహనాల రాకపోకలు పూర్తిగా స్థంబించాయి. కొంతసేపు ట్రాఫిక్ కి తీవ్ర అంతరాయం ఏర్పడింది. మాల్తుమ్మెద గ్రామంలో మాల్తుమ్మెద సొసైటీతో పాటు ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కోనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని,కోనుగోలు కేంద్రం ప్రారంభించి నెలలు గడుస్తున్న కేవలం 20శాతం ధాన్యం మాత్రమే తరలించడం జరిగిందని ,రెండు కోనుగోలు కేంద్రంలో సుమారు 150 లారీల ధాన్యం నిలువ ఉందని,ఇప్పటివరకు కేంద్రాల్లో ధాన్యం తూకం వేసి 6 వేల బస్తాలు నిలువ ఉందని,లారీలు రాక ధాన్యం పోక రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని రైతులు వాపోయారు. కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యం లారీల కొరతతో రైస్ మిల్లులకు చేరక అరిగోస పడుతున్నారని, లారీల కొరత చాలా ఎక్కువగా ఉందని అధికారులు లారీలు వచ్చేలా చూడాలని పేర్కొన్నారు.ధాన్యం కోసి ఆరబెట్టిన తర్వాత దాదాపు 10 నుంచి 18 రోజుల వరకు రైతులు కోనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు కాస్తున్నారని ధాన్యం తూకం వేసిన తర్వాత ధాన్యాన్ని లోడ్ చేయాలంటే లారీ డ్రైవర్లు ఒక ధాన్యం బస్తాకు రూ.3 ఇస్తేనే ధాన్యాన్ని లోడ్ చేస్తామని,లేదంటే చెయ్యమని బెదిరిస్తున్నారన్నారు. రైస్ మిల్లర్లు,లారీ డ్రైవర్లు కలిసి దోచుకుంటే అధికారులు మాములుగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపించారు. సమాచారం తెలుసుకున్న ఎల్లారెడ్డి సిఐ రాజారెడ్డి ఘటన స్థలానికి చేరుకొని రైతులతో చర్చలు జరిపారు.సంబంధిత కాంట్రాక్టర్ తో మాట్లాడి లారీలు వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన రైతులు తహాశీల్దార్ రావాలని







మా రైతుల గోస వినాలని డిమాండ్ చేయడంతో ఆర్ఐ మహేష్ చంద్ర సంఘటన స్థలానికి చేరుకోవడంతో సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అధికారుల హామీతో రైతులు తమ ఆందోళనను విరమించారు.,అనంతరం అధికారులు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామా సర్పంచ్ సాయిలు, గ్రామస్థులు ,రైతులు తదితరులు పాల్గొన్నారు. ధాన్యం దిగుమతిలో మిల్లర్ల అలసత్వం కోనుగోలు కేంద్రం నుంచి ధాన్యం ఎగుమతి చేసిన రైస్ మిల్లర్లుకు పంపితే ధాన్యాన్ని దిగుమతి చేసుకోవడం లేదని,మిల్లుర్లు సైతం తాలు,తేమ పేరుతో క్వింటాకు మూడు నుంచి నాలుగు వరకు తరుగుకు అంగీకరిస్తేనే ధాన్యం దిగుమతి చేసుకుంటామని కొర్రీలు పెడుతుండడంతో ఒక్కో లారీ రెండు,మూడు రోజులు మిల్లుల వద్దే ఆగిపోయాయని ,మిల్లర్లతో సంప్రదింపులు జరిపి వెంట వెంటనే సమస్యను పరిష్కరించడంలో అధికారులు విఫలమవుతున్నారని.రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసుకుని రైతులు ఎదురుచూస్తున్నారని రైతులు వాపోయారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోని లారీలు వచ్చేలా చూడాలని కోరారు.

**6రోజుల నుంచి ఒక్క లారీ రాలే..**

**-ఈటెల యేసయ్య మాల్తుమ్మెద గ్రామా రైతు**

నావి 1000 సంచుల దాన్యం కోనుగోలు కేంద్రంలోనే ఉన్నాయి. ధాన్యం తూకం వేసి 6 రోజులవుతున్నా ఇప్పటివరకు ఒక్క లారీ రాలే. మా గ్రామానికి లారీలే రావడం లేదు. ఎవరికి చెప్పిన పట్టించుకోవడం లేదు.ధాన్యం కొనుగోళ్లలో రైస్ మిల్లరు దోపిడీ చేస్తున్నారని తరుగు ఇస్తేనే లారీలను అన్ లోడ్ చేస్తున్నారని,లారీ డ్రైవర్లకు బస్తాకు రూ.3ఇస్తేనే ధాన్యం లోడ్ చేస్తామని అంటున్నారు.ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి లారీలను పంపించి ధాన్యం పోయేలా చూడాలి.

**యాసంగిలో పండించిన ధాన్యం మిల్లర్ల వద్దకు చేర్చాలంటే తల ప్రాణం తోకకు వస్తుంది..**

**-బోయిని నరేష్ మాల్తుమ్మెద గ్రామా రైతు**



యాసంగిలో పండించిన ధాన్యం మిల్లర్ల వద్దకు చేర్చాలంటే తల ప్రాణం తోకకు వస్తోందని నావి 800 సంచుల ధాన్యాన్ని తూకం వేసి 3 రోజులవుతున్నా ఇప్పటివరకు ఇప్పటివరకు రైసుమిల్లుకు ధాన్యం పోలె.ఎవరికి చెప్పిన పట్టించుకోవడం లేదు. లారీ డ్రైవర్లకు బస్తాకు రూ.3ఇస్తేనే ధాన్యం లోడ్ చేస్తామని అంటున్నారు.రోజు కొనుగోలు కేంద్రంలోనే పడిగాపులు కాస్తున్నాం.ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి లారీలను పంపించి ధాన్యం తరలించేలా చర్యలు తీసుకోవాలి.

# అష్టముఖి కోనేరు వద్ద పోటెత్తిన భక్తజనం అమావాస్య సందర్భంగా..



**ప్రజా జ్యోతి బోధన్ మే. 16..**నిజామాబాద్ జిల్లాలొ దక్షిణ భారతదేశంలో ఏకైక అష్ట ముఖి కోనేరు ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామంలో లక్ష్మి నరసింహ స్వామి ఆలయం ఉండడం వలన ఈరోజు ప్రత్యేకమైన అమావాస్య కాబట్టి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అష్టముఖి కోనేరులో స్నానం ఆచరించి స్వామివారిని దర్శించుకుంటే తాము చేసిన సర్వ పాపాలు శని దోషాలు పోతాయని భక్తుల నమ్మకం అష్టైశ్వర్యాలు చేకూరుతాయని భక్తుల నమ్మకం శనివారం ఎడపల్లి మండలం జాన్కంపేట్ శివారులోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు అమావాస్య శనివారం వస్తే అష్టముఖి కోనేరులో స్నానమాచరించడం చేసిన సర్వ పాపాలు పోతాయని భక్తుల నమ్మకం

# శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయంలో ఘనంగా కళ్యాణ మహోత్సవాలు ప్రారంభం





**రుద్రూర్, మే16(ప్రజాజ్యోతి):** రుద్రూర్ మండల కేంద్రంలోని శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయంలో కళ్యాణ మహోత్సవ వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి.రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.శనివారం దేవికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించడంతో పాటు భజనలు, సంకీర్తనలు, పట్టు మహోత్సవ కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో కొనసాగాయి.ఆలయం పరిసరాలు విద్యుత్ దీపాలతో అలంకరించి ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు.ఆదివారం ఉదయం దేవి శోభాయాత్ర నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం దేవి కళ్యాణ మహోత్సవం వైభవంగా జరగనుందని, భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు వారు వివరించారు.

# ఆత్మలింగేశ్వర ఆలయ అభివృద్ధికి రూ.25వేలు విరాళం



**నాగిరెడ్డిపేట్,మే16(ప్రజాజ్యోతి):** నాగిరెడ్డిపేట్ మండలంలోని ఆత్మకూర్ గ్రామంలో గల ఆత్మలింగేశ్వర దేవాలయ అభివృద్ధికి టిఆర్ఎస్ పార్టీ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు సంపత్ గౌడ్ రూ.25వేలు విరాళం అందజేసినట్లు నాయకులు తెలిపారు.ఈ విరాళాన్ని శనివారం ఆలయ కమిటీ సభ్యులకు టిఆర్ఎస్ పార్టీ నాయకులు అందజేశారు.ఆత్మలింగేశ్వర దేవాలయానికి విరాళం ఇవ్వడం సంతోషంగా ఉందని, ప్రజలపై అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆయన ఆకాంక్షించినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మండల ప్రెసిడెంట్ సుభాన్ రెడ్డి,సీనియర్ నాయకులు బాగారెడ్డి,జనరల్ సెక్రటరీ ఖలీల్,ఎస్సి సెల్ మండల్ అధ్యక్షులు శ్రీను, మండల మహిళా అధ్యక్షులు పద్మ మండల యువజన అధ్యక్షులు ఫహీమ్, మండల పద్మశాలి అధ్యక్షులు ప్రవీణ్,పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు బదిలీల్లో పారదర్శకతకు పెద్దపీట

**కౌన్సిలింగ్ ద్వారా 09 మంది హెడ్ కానిస్టేబుళ్లకు పోస్టింగ్‌లు**

**జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర,**



**కామారెడ్డి ప్రతినిధి మే 16. (ప్రజాజ్యోతి)** కామారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం జిల్లా ఎస్పీ యం.రాజేష్ చంద్ర, ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బదిలీల ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించారు. కరీంనగర్ మరియు రాజన్న సిరిసిల్ల జిల్లాల నుంచి కానిస్టేబుల్ నుండి హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొంది కామారెడ్డి జిల్లాకు బదిలీపై వచ్చిన 09 మంది హెడ్ కానిస్టేబుళ్లకు కౌన్సిలింగ్ మరియు సీనియారిటీ పద్ధతిలో పోస్టింగ్‌లను కేటాయించారు. వారితో జిల్లా ఎస్పీ వివరంగా మాట్లాడి వారి ప్రాధాన్యతలను తెలుసుకుని, విల్లింగ్ స్టేషన్లు, జీవిత భాగస్వామి ఉద్యోగ స్థానం (స్పౌస్), సీనియారిటీ, ఆరోగ్య పరిస్థితులు మరియు సర్వీస్ రికార్డును పరిగణనలోకి తీసుకుని కౌన్సిలింగ్ ద్వారా బదిలీల ప్రక్రియను పూర్తి చేశారు. అదేవిధంగా వారి పిల్లల విద్యాభ్యాసం గురించి కూడా ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర మాట్లాడుతూ, పారదర్శకమైన బదిలీలు సిబ్బందిలో విశ్వాసాన్ని పెంపొందించడమే కాకుండా బాధ్యతాయుత విధులకు బలమైన పునాదిగా నిలుస్తాయని అన్నారు. పోలీసు సిబ్బంది క్రమశిక్షణ, నిబద్ధత, నిజాయితీతో విధులు నిర్వహిస్తూ ప్రజల్లో పోలీసు శాఖపై విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. పోలీసు అధికారిగా నైతిక విలువలు, సేవాభావం అత్యంత ముఖ్యమని పేర్కొంటూ, విధుల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకుని ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని ఎస్పీ దిశానిర్దేశం చేశారు. కొత్తగా పోస్టింగ్‌లు పొందిన హెడ్ కానిస్టేబుళ్లు తమ విధి ప్రాంతాల్లో అంకితభావంతో పనిచేసి జిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ కె. నరసింహారెడ్డి, జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులు మరియు పరిపాలనా సిబ్బంది పాల్గొన్నారు.

# భవన నిర్మాణా రంగాల కార్మిక సంఘం సమావేశం



**రామారెడ్డి మే 16 (ప్రజా జ్యోతి)** కామారెడ్డి జిల్లా బిఎన్ఆర్ కేఎస్ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు కామల్ల ఐలన్న పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడుతూ...! మండల జిల్లాల వారీగా నాయకత్వాన్ని బలోపేతం చేయాలని వారు సూచించారు. అదేవిధంగా కార్మికుల కోసం నా జీవితాంతం అహర్నిశలు కృషి చేస్తానని చెప్పారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పు సాయికుమార్ మాట్లాడుతూ..! వచ్చే నెలలో కామారెడ్డిలో పెద్ద సభ ఏర్పాటు చేసి విజయవంతం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి జ్ఞానబోయిన శ్యామ్ జిల్లా కార్యదర్శి ఎండి రజాక్ జిల్లా ఉపాధ్యక్షులు తాటికొండ బాబు సిద్దిపేట జిల్లా కోశాధికారి అంకిరెడ్డి పల్లినరసింహులు, రామారెడ్డి మండల అధ్యక్షులు బింగి ప్రసాద్, రామారెడ్డి మండల సలహాదారు రాచమల్ల శ్రీనివాస, టౌన్ ప్రెసిడెంట్ దేమే రవి,బిక్నూర్ మండల కడవెరుగు సిద్ధ రాములు, యాదగిరి, నాగులు, తదితరులు పాల్గొన్నారు.

# పంట మార్పిడి అవసరం



**రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అన్నదాతల అవగాహన కార్యక్రమం"**

**మాచారెడ్డి మే 16.(ప్రజాజ్యోతి)** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన "రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు- అన్నదాతల అవగాహన కార్యక్రమం " ను మాచారెడ్డి మండలంలోని కొత్తపల్లి గ్రామంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల నుండి డా సంపత్ కుమార్ మరియు డా. సునీల్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ నుండి , వ్యవసాయ అధికారి పవన్ కుమార్,వ్యవసాయ విస్తరణ అధికారి సంజీవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ వరిలో సన్న గింజ రకాలు, వాటి లక్షణాలు తెలుపుతూ రైతు సన్న గింజ రకాలు వేయడం ద్వారా బోనస్ పొందవచ్చని తెలిపారు. పంట మార్పిడి, అవసరం అయిన మేరకే రసాయనాలు వాడటం గురించి తెలిపారు. పవన్ కుమార్, మాట్లాడుతూ మోతాదు ప్రకారం రైతులు యూరియా వాడాలని, సాగు ఖర్చు తగ్గించి నేల ఆరోగ్యం కాపాడాలని కోరారు. వానకాలం మరియు యాసంగికి అనువైన వరి సన్న రకాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. మార్కెట్లో గిరాకీ ఉన్న వరి రకాలు పండించాలని కోరారు. సేంద్రియ పద్ధతులు పాటించి ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినాలని తెలిపారు. గ్రామ సర్పంచ్, మరియు గ్రామ ఉప సర్పంచ్ ఐలయ్య రైతులు శాస్త్రవేత్తలు చెప్పిన విషయాలు పాటించి లాభం పొందాలని సూచించారు. శ్రీకాంత్ అనే రైతు సమగ్ర వ్యవసాయ పద్ధతి ద్వారా ఎలా లాభం పొందవచ్చని తన అనుభవాలు పంచుకున్నారు.ఈ సందర్భంగా రైతులు వారి సందేహాలు నివృత్తి చేసుకున్నారు. పచ్చి రొట్ట మరియు విత్తనాలు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు.

# దివ్యాంగ విద్యార్థులకు జీవనోపకరణాలు అందజేత





**ఎంఈఓ ఆనంద్ రావు**

**రామారెడ్డి మే 16 (ప్రజా జ్యోతి)** కామారెడ్డి జిల్లాలోని కళాభారతి యందు తెలంగాణ సమగ్ర శిక్ష విద్యాశాఖ మరియు భారతీయ జీవనోపకరణాల తయారీ సంస్థ వారి సమన్వయంతో జిల్లాలోని వివిధ మండలాలలో గల వివిధ రకాల వైకల్యాలు గల విద్యార్థులకు శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సదస్సులో మండల విద్యాశాఖ అధికారి ఆనంద్ రావు పర్యవేక్షణలో గత సంవత్సరం ఆగస్టులో డాక్టర్ల పర్యవేక్షణలో నిర్ధారణ చేయబడిన వారికి జీవనఉపకరణాలను అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో భాగంగా రామారెడ్డి మండలంలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన 9 మంది వివిధ రకాల దివ్యాంగత్వం గల విద్యార్థులకు ముఖ్య అతిథి గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, కామారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ అలాగే వైస్ చైర్పర్సన్ జిల్లా విద్యాశాఖ అధికారి రాజు,జిల్లా దివ్యాంగ విద్యార్థుల సమన్వయకర్త నాగేందర్, వేణు శర్మ, కామారెడ్డి మండల విద్యాశాఖ అధికారి సమక్షంలో ఈ ఉపకారణాలను పంపిణీ చేయడం జరిగింది. రామరెడ్డి మండలంలోని గోకుల్ తండా మరియు ఇసనపల్లి ,రామారెడ్డి, కన్నాపూర్ ,రెడ్డిపేట్, మరియు రెడ్డి పెట్ తండా గ్రామాలకు చెందిన దివ్యాంగ విద్యార్థులకు జీవనోపకరణాలను అందించి వాటిని ఉపయోగించే విధానం మరియు వాటి వల్ల కలిగే ప్రయోజనాలను క్లుప్తంగా తల్లిదండ్రులకు విద్యార్థుల సమక్షంలో వివరించి చూపించడం జరిగింది.ఈ కార్యక్రమంలో రామరెడ్డి భవిత పాఠశాల ప్రత్యేక ఉపాధ్యాయులు రమేష్, శశి కుమార్, సృజన, పాల్గొన్నారు.

# యాసంగి 2025-26 సీజన్‌లో మక్కజొన్న కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**కామారెడ్డి ప్రతినిధి మే 16. (ప్రజాజ్యోతి)** యాసంగి 2025-26 సీజన్‌లో జిల్లాలో కొనసాగుతున్న మక్కజొన్న కొనుగోలు ప్రక్రియపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం శనివారం తన ఛాంబర్ లో నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్, జిల్లా సహకార అధికారి (డిసిఓ), జిల్లా మార్కెటింగ్ అధికారి (డిఎంఓ), డి.ఎం. మార్క్ఫెడ్, వేర్‌హౌస్ మేనేజర్లు, తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ (టిజిఎస్ డబ్ల్యూసి) తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు తీసుకువస్తున్న మక్కజొన్నను వేగవంతంగా కొనుగోలు చేసి, ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లా సహకార అధికారికి మండలాల వారీగా కొనుగోలు చేయాల్సిన మక్కజొన్న నిల్వలను నిరంతరం పర్యవేక్షిస్తూ కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అదేవిధంగా సొసైటీ స్థాయిలో హమాలీల సంఖ్యను పెంచి, కొనుగోలు చేసిన మక్కజొన్న నిల్వలను ప్రతిరోజూ గిడ్డంగులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ (టిజిఎస్డబ్ల్యూసి) రీజినల్ మేనేజర్‌కు ఇప్పటికే గుర్తించిన గోడౌన్లను వెంటనే స్వాధీనం చేసుకుని వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. అలాగే అన్‌లోడింగ్ పాయింట్ల వద్ద హమాలీల సంఖ్యను పెంచి, ప్రతిరోజూ వాహనాలను పూర్తిస్థాయిలో అన్‌లోడ్ అయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో అదనపు నిల్వ సామర్థ్యం కలిగిన గోడౌన్లను గుర్తించి స్టోరేజ్ స్పేస్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కూడా సూచించారు. లారీ రవాణా కాంట్రాక్టర్‌కు అవసరమైన లారీల సంఖ్యను పెంచి, మక్కజొన్న రవాణా ప్రక్రియ ఎటువంటి ఆలస్యం లేకుండా నిరంతరాయంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ మరియు సంబంధిత అధికారులకు జిల్లాలో అదనపు నిల్వ సామర్థ్యం గల గోడౌన్లను గుర్తించి వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అలాగే డి.ఎం. మార్క్ఫెడ్ మరియు అదనపు కలెక్టర్‌కు జిల్లాలో మక్కజొన్న కొనుగోలు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# అరుదైన మే పుష్పం



**రామారెడ్డి మే 16 (ప్రజా జ్యోతి)** రామారెడ్డి మండలంలోని అన్నారం గ్రామంలో ఐపిసి పెంత కొస్తు చర్చ్ ప్రాంగణంలో వింతైన అద్భుతమైన ఓ అరుదైన పుష్పం వికసించడంతో గ్రామ ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఈ యొక్క పుష్పం వేసవిలో మాత్రమే సంవత్సరానికి ఒకసారి మాత్రమే పూస్తుంది. అదేవిధంగా హిమాలయ లాంటి ప్రదేశాలలో అరుదుగా కనిపిస్తాయి ఇలాంటి పుష్పాలు అని చర్చ్ పాస్టర్ డేవిడ్ అన్నారు. వాస్తవంగా సంవత్సరంలో ఒకసారి మాత్రమే ఈ మే పుష్పం వికసిస్తుంది.ఈ పుష్పం ఈ పుష్పం కేవలం మే నెలలో మాత్రమే వికసిస్తుందని దీని ప్రత్యేకత కూడా చాలా ఉంటుందని తెలిపారు.దీనిని చూడటానికి చాలా అందంగా ఆకర్షణీయంగా కనబడేలా ఉండడం వలన చూపరులు ఆసక్తిగా తిలకించడం జరిగింది.

# తిమ్మక్‌పల్లి గ్రామపంచాయతీని సందర్శించిన డిఎల్‌పిఓ

## గ్రామాభివృద్ధి పనులపై ప్రత్యేక సమీక్ష -- ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ



**కామారెడ్డి రూరల్, మే 16, ప్రజా జ్యోతి :** కామారెడ్డి మండలంలోని తిమ్మక్‌పల్లి గ్రామపంచాయతీని జిల్లా పంచాయతీ అధికారి (డిఎల్‌పిఓ) సందర్శించి గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పారిశుద్ధ్య చర్యలు, పల్లె ప్రగతి పనులు, హరితహారం కార్యక్రమాలు, తాగునీటి వసతులు, డ్రైనేజీ వ్యవస్థ తదితర అంశాలపై సమగ్రంగా పరిశీలించారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. డిఎల్‌పిఓ గ్రామంలోని ప్రధాన రహదారులు, కాలువలు, వీధి పరిశుభ్రత, చెత్త సేకరణ విధానం, మొక్కల సంరక్షణ, తాగునీటి సరఫరా పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. గ్రామంలో పరిశుభ్రత మరింత మెరుగుపడేలా ప్రతి ఇంటి వద్ద అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని గ్రామ సిబ్బందికి సూచించారు. ఎక్కడా చెత్త పేరుకుపోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ వ్యవస్థను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు.
గ్రామాభివృద్ధిలో భాగంగా చేపడుతున్న పల్లె ప్రగతి కార్యక్రమాల అమలుపై డిఎల్‌పిఓ సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలకు మౌలిక వసతులు మరింత మెరుగ్గా అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, ప్రతి కాలనీలో పారిశుద్ధ్య నిర్వహణ పటిష్టంగా ఉండాలని తెలిపారు. అదేవిధంగా గ్రామంలో ఏర్పాటు చేస్తున్న సోలార్ లైట్లు, సీసీ కెమెరాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు, హరితహారం కార్యక్రమాలపై ప్రత్యేకంగా చర్చించారు. గ్రామ భద్రత, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు ఈ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గ్రామంలో మరిన్ని మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుని ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులు చేపట్టాలని డిఎల్‌పిఓ అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, గ్రామ ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ గ్రామంగా నిలబెట్టే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో మాట్లాడిన డిఎల్‌పిఓ గ్రామంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాభివృద్ధికి ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కోరారు. ప్రతి ఒక్కరు పరిశుభ్రత పాటిస్తూ పచ్చదనం పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు. గ్రామ సర్పంచ్ గుర్రపు లక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం సహకారంతో గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు అందించేందుకు పాలకవర్గం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఉపసర్పంచ్ గొర్రె పరమేష్ మాట్లాడుతూ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుర్రపు లక్ష్మి, ఉపసర్పంచ్ గొర్రె పరమేష్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డిఎల్‌పిఓ గ్రామాన్ని సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# అదనపు ఈజీఎస్ అధికారిగా కుటుంబరావు బాధ్యతలు స్వీకరణ



**కామారెడ్డి ప్రతినిధి మే 16. (ప్రజాజ్యోతి)** అదనపు డీఆర్డీఏ ఈజీఎస్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన కుటుంబరావు శనివారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.

# సకాలంలో బి పాజిటివ్ రక్తం అందజేత



ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు

**కామారెడ్డి ప్రతినిధి మే 16. (ప్రజాజ్యోతి)** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో సామల సుష్మ కు బి పాజిటివ్ రక్తం అవసరం కావడంతో సింగరాయ పల్లి గ్రామానికి చెందిన అధికం నిఖిల్ గౌడ్ సకాలంలో రక్తాన్ని అందజేసి ప్రాణదాతగా నిలవడం జరిగిందని ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ వేసవి కాలం కావడం వలన రక్తనిధి కేంద్రాలలో రక్తం దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని యువత రక్తదానానికి ముందుకు రావాలని, రక్తానికి ప్రత్యామ్నాయ మార్గాలు లేవని స్వచ్ఛందంగా ముందుకు వచ్చే రక్తదాతల తోనే ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చునని అన్నారు. రక్తదాత నిఖిల్ గౌడ్ కు అభినందనలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో కామారెడ్డి రక్తదాతల సమూహ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ వేద ప్రకాష్ అధ్యక్షుడు జమీల్ హైమద్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పుట్ల అనిల్ కుమార్,ఉపాధ్యక్షులు ఎర్రం చంద్రశేఖర్,పర్ష వెంకటరమణ, సలహాదారులు జలిగామ శ్రీకాంత్, అంకం బాలకిషన్ లు పాల్గొనడం జరిగింది.

# ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలి

## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి






**కామారెడ్డి ప్రతినిధి మే 16. (ప్రజాజ్యోతి)** శనివారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, అదనపు కలెక్టర్ విక్టర్, సంబంధిత అధికారులు, తదితరులు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం అమలుకు కార్యాచరణ విడుదల చేసిందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా జూన్ 15 నుంచి 24 వరకు సంబంధిత సిబ్బంది, అధికారులకు శిక్షణ, ఎన్యూమరేషన్ ఫారాల ముద్రణ తదితర ఏర్పాట్లు చేపట్టనున్నట్లు చెప్పారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటికి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసి, తిరిగి సేకరించే ప్రక్రియ నిర్వహిస్తారని తెలిపారు. జూలై 24లోగా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పూర్తి చేసి, జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురిస్తారని వెల్లడించారు. జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ, సెప్టెంబర్ 28 వరకు వాటి పరిష్కారం చేపట్టి, అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ప్రారంభానికి ముందే ఓటర్ల మ్యాపింగ్ పూర్తి చేయాలని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఆబ్సెంట్, షిఫ్ట్, డెత్ సంబంధిత ఫారం-6, 7, 8 దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో భాగంగా ప్రతి పోలింగ్ కేంద్రంలో 1,200 మందికి మించకుండా ఓటర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బూత్ స్థాయి అధికారుల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు, దివ్యాంగ ఓటర్ల నమోదుపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మీడియా, సోషల్ మీడియా ద్వారా వచ్చే ప్రతికూల వార్తలపై వెంటనే స్పందించి, తప్పుడు ప్రచారాన్ని అడ్డుకోవాలని అధికారులను అప్రమత్తం చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం దృష్ట్యా జిల్లాలో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేస్తున్నామని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అలాగే కార్యక్రమంపై సిబ్బంది, అధికారులకు అవసరమైన శిక్షణ అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో తహసీల్దారులు, ఎన్నికల సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రామేశ్వరపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో ఉద్రిక్త పరిస్థితులు

మూడు రోజులుగా కొనసాగుతున్న గొడవలు..

దేవునిపల్లి పోలీసుల నిర్లక్ష్యంపై కాలనీవాసుల ఆగ్రహం

"ప్రాణాలు పోతే గానీ చర్యలు తీసుకోరా?"

అంటూ పోలీసులను నిలదీసిన బాధితులు

కామారెడ్డి రూరల్ మే 16 ప్రజా జ్యోతి









**కామారెడ్డి, మే 17 (ప్రజాజ్యోతి):** కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 2వ వార్డు రామేశ్వరపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో గత మూడు రోజులుగా కొనసాగుతున్న గొడవలు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. ఒకే కుటుంబానికి చెందిన కొంతమంది వ్యక్తులు వరుసగా గొడవలకు దిగుతూ కాలనీలో భయాందోళనలు సృష్టిస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. రాత్రింబవళ్లు జరుగుతున్న ఈ వివాదాల కారణంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనలపై పలుమార్లు దేవునిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేసినప్పటికీ పోలీసులు సరైన చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. గొడవలు జరుగుతున్నాయని సమాచారం అందగానే పోలీసులు కాలనీకి వచ్చి తమ ట్యాబ్‌లలో ఫోటోలు, వీడియోలు తీసుకొని వెళ్లిపోతున్నారని, కానీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించే దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు.

కాలనీవాసుల కథనం ప్రకారం, గత మూడు రోజులుగా అదే కుటుంబానికి చెందిన వ్యక్తులు మద్యం సేవించి గొడవలకు దిగుతూ ఇతర కుటుంబాలను బెదిరిస్తున్నారని తెలిపారు. గొడవలను అడ్డుకునేందుకు ప్రయత్నించిన డబుల్ బెడ్‌రూమ్ కాలనీకి చెందిన తోకల శ్రీనివాసుపై దాడి చేసి, తలపై ఇష్టం వచ్చినట్లు కొట్టారని ఆరోపించారు. దాడిలో ఆయనకు తీవ్ర గాయాలు అయినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనను చూసిన మహిళలు, చిన్నారులు భయంతో ఇళ్లలోనే ఉండిపోయారని సమాచారం. "పోలీసులకు ఎన్నిసార్లు చెప్పినా స్పందన లేదు. గొడవలు జరుగుతున్నాయని ఫోన్ చేస్తే వస్తున్నారు.. కానీ కేవలం ఫోటోలు తీసుకొని వెళ్లిపోతున్నారు. అసలు సమస్యను పట్టించుకోవడం లేదు. మనిషి ప్రాణాలు పోతే గానీ చర్యలు తీసుకోరా?" అంటూ కాలనీవాసులు పోలీసుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కాలనీలో ఇప్పటికే పలుమార్లు చిన్నచిన్న వివాదాలు చోటుచేసుకున్నప్పటికీ, ఈసారి పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న భయంతో ప్రజలు జీవిస్తున్నారని, రాత్రి సమయంలో బయటకు రావడానికి కూడా భయపడుతున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో కాలనీవాసులు పోలీసు ఉన్నతాధికారులను వెంటనే జోక్యం చేసుకోవాలని కోరుతున్నారు. గొడవలకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కాలనీలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో శాంతిభద్రతలు కాపాడాలని, ప్రజలకు భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం రామేశ్వరపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, స్థానిక ప్రజలు భయాందోళనల మధ్య కాలం గడుపుతున్నారు.

# అర్ధరాత్రి వ్యూహం.. తెల్లవారుజామున మెరుపు దాడి!

## అన్నమయ్య జిల్లాలో పోలీసుల 'ఆపరేషన్ వజ్రప్రహార్'



**మదనపల్లి :** శాంతిభద్రతల పరిరక్షణే శ్వాసగా, ప్రజల సురక్షిత జీవనమే పరమావధిగా అన్నమయ్య జిల్లా పోలీస్ శాఖ శనివారం తెల్లవారుజామున అత్యంత పకడ్బందీగా రెండు భారీ నిఘా ఆపరేషన్‌లను నిర్వహించింది. జిల్లాను నేరరహితంగా మార్చడానికి, సమాజానికి ముప్పుగా పరిణమిస్తున్న శక్తుల ఆటకట్టించడానికి "ఆపరేషన్ వజ్రప్రహార్" నిర్వహించారు. ఈ వ్యూహాత్మక చర్య శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత, జిల్లా అంతా ప్రశాంతంగా నిద్రిస్తున్న సమయంలో అత్యంత నిశ్శబ్దంగా మొదలైంది. మదనపల్లె, రాయచోటి సబ్ డివిజన్లలోని సమస్యాత్మక ప్రాంతాలే లక్ష్యంగా పోలీసులు కార్యాచరణకు సిద్ధమయ్యారు. సరిగ్గా సమయం ఉదయం 4:00 గంటలు.. కోడికూత కూడా వినబడని ఆ కారుచీకట్లో ప్రజల రక్షణ కోసం పోలీస్ బలగాలు అడుగులు వేశాయి. మదనపల్లె డీఎస్పీ శ్రీమతి బి. పావని గారి నేతృత్వంలో 105 మంది, రాయచోటి డీఎస్పీ శ్రీ ఎం.ఆర్. కృష్ణమోహన్ గారి నేతృత్వంలో 61 మంది.. మొత్తం 166 మంది నిబద్ధత గల పోలీస్ అధికారులు, సిబ్బంది ఏకకాలంలో రంగంలోకి దిగారు. ఎవరికీ ఎటువంటి ముందస్తు సమాచారం లీక్ కాకుండా, అత్యంత రహస్యంగా మదనపల్లె తాలూకా పరిధిలోని కోళ్లబైలు జగన్ కాలనీ, కలకడ మండలం బంగారువాండ్లపల్లి గ్రామాలను పోలీసులు చుట్టుముట్టారు. నిశ్శబ్దంగా సాగిన ఈ మెరుపు తనిఖీలు (కార్డన్ అండ్ సెర్చ్) నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో క్షేత్రస్థాయి సిబ్బంది వీధుల్లో సోదాలు నిర్వహిస్తుండగా, భూతలం నుండి ఎవరూ తప్పించుకోకుండా నిఘాను మరింత పటిష్టం చేశారు. ఈ ఆపరేషన్‌లో జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు అధునాతన డ్రోన్ కెమెరాల ద్వారా గ్రామాలపై గగనతలం నుంచి పర్యవేక్షణ చేపట్టారు. గ్రామంలోని ప్రతి ప్రాంతాన్ని నిశితంగా పరిశీలిస్తూ అసాంఘిక శక్తుల కదలికలను గుర్తించేలా నిఘా కొనసాగించారు. ఈ అధునాతన నిఘా వ్యవస్థతో గ్రామాల్లోని ప్రతి సందు, పొదలు మరియు నిర్మానుష్య ప్రాంతాలను కంట్రోల్ రూమ్ స్క్రీన్లపై నిరంతరం పర్యవేక్షించారు. పోలీసులు పన్నిన ఈ రక్షణ వలయంలో వాహనాల తనిఖీలు ముమ్మరంగా సాగాయి. రహదారి నిబంధనలు ఉల్లంఘిస్తూ, నెంబర్ ప్లేట్లు మార్చి, సరైన రికార్డులు లేకుండా తిరుగుతున్న వాహనాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఆయా ప్రాంతాలలో అనుమానాస్పదంగా ఉన్న మొత్తం 133 వాహనాలను నిలిపివేసి క్షుణ్ణంగా తనిఖీ చేయగా.. పక్కా ఆధారాలు లేని 78 వాహనాలను స్పాట్‌లోనే స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇందులో 71 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలు, 2 కార్లు మరియు ఒక ట్రాక్టర్ ఉన్నాయి. చట్టపరమైన పూర్తి పత్రాలు సమర్పించిన తర్వాతే ఈ వాహనాలను విడుదల చేయడం జరుగుతుందని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అయితే పోలీస్ శాఖ అంటే కేవలం తనిఖీలు, కేసులు మాత్రమే కాదు.. ప్రజలతో మమేకమయ్యే రక్షకులు అని నిరూపిస్తూ, తనిఖీల అనంతరం మదనపల్లెలో 300 మంది, కలకడలో 210 మంది ప్రజలను ఒకచోటకు చేర్చి ముఖాముఖి సమావేశాలు నిర్వహించారు. స్థానిక శాంతిభద్రతల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. "మీ ప్రాంతాల రక్షణే మా బాధ్యత. ఊర్లోకి కొత్త వ్యక్తులు వచ్చినా, లేదా ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు గమనించినా భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించండి" అని స్థానికుల్లో ధైర్యాన్ని నింపారు.

అనంతరం సమాజ శ్రేయస్సు కోసం, నేరాల నిర్మూలన కోసం ప్రజలందరితో కలిసి పోలీసులు, ఈగల్ టీమ్ సిబ్బంది "ఆపరేషన్ వజ్రప్రహార్ ప్రతిజ్ఞ" చేయించారు. ప్రజలు, పోలీసులు కలిసికట్టుగా నిలబడిన ఆ క్షణం ఈ ఆపరేషన్‌కే మకుటాయమానంగా నిలిచింది. యువత భవిష్యత్తును పాడుచేస్తూ, సమాజాన్ని పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాల (గంజాయి, డ్రగ్స్) ముఠాలను వేరుతో సహా తొలగించడమేనని. ఈ సందర్భంగా డిఎస్పీ లు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ఇకపై జిల్లాలో గంజాయి రవాణా చేసినా, విక్రయించినా పాత నేరస్థులైనా, కొత్త వారైనా సరే.. పీడీ యాక్ట్, పి.ఐ.టి, ఎన్‌డీపీఎస్ చట్టాల కింద అత్యంత కఠినమైన జైలు శిక్షలు తప్పవని స్పష్టం చేశారు.

## అడవులు కాపాడితేనే భవిష్యత్తుకు భరోసా





పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత -ఎఫ్‌డీఓ సునీత

**గాంధారి, మే 16 (ప్రజాజ్యోతి)** అడవులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని బాన్సువాడ ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ (ఎఫ్‌డీఓ) సునీత పేర్కొన్నారు. గాంధారి మండలంలోని నాగ్లూర్ తండా పరిధిలోని అటవీ భూముల్లో శనివారం అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పర్యావరణ పరిరక్షణ అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అడవులు నశిస్తే వర్షాభావం, కాలుష్యం, వాతావరణ మార్పులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ముఖ్యంగా రైతులు పెద్ద ఎత్తున నష్టపోయే పరిస్థితులు ఏర్పడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. అడవులను రక్షిస్తే వన్యప్రాణులకు సహజ వాతావరణం లభించి కోతులు గ్రామాల్లోకి రాకుండా ఉంటాయని చెప్పారు. దీంతో గ్రామాల్లో కోతుల బెడద కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గాంధారి ఎఫ్‌ఆర్‌ఓ హేమ చందన, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మొజ్జం అలీ ఖాన్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ అరుణ, నేరల్ తండా ఉప సర్పంచ్ రాథోడ్ నెహ్రూ నాయక్, మాజీ సర్పంచ్ బాలు నాయక్, అటవీశాఖ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## గొల్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం ప్రత్యేక తల్లిదండ్రుల సమావేశం

విద్యార్థుల సంఖ్య పెంపు, వంట సిబ్బంది ఎంపికపై చర్చ

**కామారెడ్డి రూరల్ మే 16 ప్రజా జ్యోతి** రామారెడ్డి మండలంలోని గొల్లపల్లి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్)లో ఈ నెల 14న నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి ఉపాధి హామీ పనుల కారణంగా తల్లిదండ్రులు హాజరు కాలేకపోవడంతో, మళ్లీ ఆదివారం (17-05-2026) ఉదయం 9:30 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయులు రాజు కుమార్ తెలిపారు. ఈ సమావేశానికి గ్రామ పాలకవర్గ సభ్యులు, వీడీసీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు తప్పక హాజరు కావాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపు, ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించడం వంటి అంశాలపై సమావేశంలో చర్చించనున్నారు. అలాగే మధ్యాహ్న భోజన వంట బాధ్యతలు నిర్వహిస్తున్న రుద్రబోయిన లక్ష్మి గారు వ్యక్తిగత కారణాలతో విధులు నిర్వహించలేమని తెలియజేయడంతో, వారి స్థానంలో కొత్త వ్యక్తిని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల ఆశావాహులు సమావేశానికి హాజరు కావాలని హెచ్‌ఎం సూచించారు.

## మోటార్ కాలిపోవడంతో వెంటనే పీకించిన సర్పంచ్ చిందం మల్లేష్



**కామారెడ్డి రూరల్ మే 16 ప్రజా జ్యోతి** కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి గ్రామంలో గ్రామ ప్రజలకు తాగునీటి సరఫరా అందించే మోటార్ అకస్మాత్తుగా కాలిపోవడంతో గ్రామంలో నీటి సమస్య తలెత్తే పరిస్థితి ఏర్పడింది. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ చిందం మల్లేష్ వెంటనే స్పందించి కాలిపోయిన మోటార్‌ను పీకించే పనులను చేపట్టించారు. గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. కొత్త మోటార్ ఏర్పాటు చేసి తాగునీటి సరఫరాను త్వరితగతిన పునరుద్ధరించేలా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. గ్రామ సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుండే సర్పంచ్ చిందం మల్లేష్ తక్షణ స్పందనపై గ్రామ ప్రజలు అభినందనలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పాలకవర్గ సభ్యులు, వార్డ్ సభ్యులు, గ్రామ సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ పారదర్శకంగా నిర్వహించాలి

**హైదరాబాద్ :** తెలంగాణ భవన్లో జరిగిన సనత్నగర్ నియోజకవర్గానికి చెందిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి, సనత్నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. రాష్ట్రంలో చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమానికి సంబంధించి ఎంపిక చేసిన బూత్ లెవెల్ అసిస్టెంట్లతో కూడిన ఈ సమావేశంలో కేటీఆర్ వారికి ఎస్ఐఆర్ (సాఎఖీ) పైన దిశానిర్దేశం చేశారు. కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణవ్యాప్తంగా "కాంగ్రెస్ పోవాలి, కేసీఆర్ రావాలి" అన్న ఆలోచన ప్రతి ఒక్కరిలో ఉన్నది. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ప్రజావ్యతిరేక కాంగ్రెస్ ను పక్కన పెట్టి, ప్రజలు కేసీఆర్ ప్రభుత్వాన్ని తిరిగి తీసుకువస్తారు. తమకు వ్యతిరేకంగా ఉన్న పార్టీల ఓటర్లను, వారి మద్దతు దారులను ఓటర్ల జాబితా నుంచి తొలగించడం, ప్రాంతీయ పార్టీలు ఉన్న రాష్ట్రాల్లో ఈ ఎస్ఐఆర్ను అడ్డగోలుగా వినియోగించడం వంటి అనేక ఆరోపణలున్నాయి. ఎస్ఐఆర్ పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ లేనే లేదు.. కేవలం పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వచ్చిన గాలి గత్తర వల్ల కొంత కనిపిస్తుంది. సోషల్ మీడియాలో ఎక్కువ, సొసైటీలో తక్కువ ఉన్న పార్టీ బీజేపీ. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేస్తున్నది కూల్చివేతలే. నగరంలో కనీసం

## బిజినెస్

### అంతర్జాతీయ మార్కెట్ల ఎఫెక్ట్.. దిగివస్తున్న బంగారం, వెండి ధరలు.. ఒక్కరోజే రూ15 వేలు తగ్గిన వెండి..!




అంతర్జాతీయ మార్కెట్లలోని పరిణామాల ప్రభావంతో దేశీయంగా బంగారం, వెండి ధరలు దిగివస్తున్నాయి. దేశీయ బులియన్ మార్కెట్‌లో ఇవాళ కూడా బంగారం, వెండి ధరలు నేలచూపులు చూశాయి. అంతర్జాతీయ అనిశ్చితులు, యూఎస్ డెట్ సెక్యూరిటీలపై రాబడులు పెరగడం, అమెరికా డాలర్ బలోపేతం కావడం లాంటి అంశాలు దేశంలో పసిడి, వెండి ధరలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా ఈ విలువైన లోహాల ధరలు మరోసారి భారీగా తగ్గాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ అందించిన సమాచారం ప్రకారం.. ఇవాళ ఉదయం 10 గంటల సమయానికి హైదరాబాద్ మార్కెట్‌లో ధరలు గణనీయంగా తగ్గాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర శుక్రవారంతో పోలిస్తే రూ.980 తగ్గి రూ.1,56,930కి పడిపోయింది. అదేవిధంగా 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర కూడా 10 గ్రాములకు రూ.900 తగ్గి రూ.1,43,850 వద్ద స్థిరపడింది. బంగారం బాటలోనే వెండి ధర కూడా నడిచింది. హైదరాబాద్ మార్కెట్‌లో కిలో వెండి ధరపై ఏకంగా రూ.15,000 మేర పతనం నమోదైంది. ఈ భారీ తగ్గుదలతో ఇవాళ కిలో వెండి ధర రూ.2.9 లక్షలకు దిగివచ్చింది. గ్లోబల్ మార్కెట్‌లోని మార్పులే దేశీయంగా ధరల తగ్గుదలకు కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

### ఆ రాష్ట్రంలో క్యాబ్, బైక్ ట్యాక్సీలపై నిషేధం!




నగరాల్లో ఎక్కడికి వెళ్లాలన్నా.. ఓలా, ఉబర్, ర్యాపిడో వంటివి బుక్ చేసుకుని వెళ్లిపోతుంటారు. అయితే మహారాష్ట్ర స్టేట్ గవర్నమెంట్ క్యాబ్, రైడ్ సేవలను నిలిపివేయాలని.. యాపిల్, గూగుల్ తమ యాప్ స్టోర్స్ నుంచి సంబంధిత యాప్స్ తొలగించాలని నోటీసులు జారీ చేసింది. రాష్ట్రంలో అక్రమంగా బైక్, ట్యాక్సీ సేవలను నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వచ్చిన తరువాత ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది. మహారాష్ట్రలో బైక్ ట్యాక్సీలు చట్టవిరుద్ధంగా నడుస్తున్నాయి, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని వాణా శాఖ మంత్రి ప్రతాప్ సర్నాయక్ సైబర్ విభాగానికి రాసిన లేఖలో వెల్లడించారు. ఆ కంపెనీల యజమానులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాపిడోకు అగ్రిగేటర్ లైసెన్స్ ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం నిరాకరించడంతో, 2022 చివరిలో బైక్ ట్యాక్సీలతో కొనసాగుతున్న వివాదం ప్రారంభమైంది. రాపిడో సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పటికీ, జనవరి 2023 నాటికి అన్ని బైక్ ట్యాక్సీ సేవలు నిలిపివేశారు. చివరికి బైక్ ట్యాక్సీల కోసం ఒక అగ్రిగేటర్ విధానాన్ని రూపొందించమని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

# ప్రపంచ ఏఐ దిగ్గజంగా టీసీఎస్

భారతీయ ఐటీ రంగంలో సరికొత్త విప్లవానికి నాంది పలుకుతూ ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన, అతిపెద్ద ఏఐ ఆధారిత టెక్నాలజీ సర్వీసెస్ కంపెనీగా అవతరించడమే తమ అంతిమ లక్ష్యమని దేశీయ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ప్రకటించింది. కంపెనీ వార్షిక నివేదిక (2025-26)లో భాగంగా వాటాదారులకు రాసిన లేఖలో టీసీఎస్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ కె.కృతివాసన్ ఈ కీలక విషయాలను వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అంతర్జాతీయ కార్పొరేట్ రంగంలో ఏఐ సాంకేతికతకు ఒక కీలక మలుపు అన్నారు. క్లయింట్లు కేవలం ప్రయోగాత్మక పైలట్ ప్రాజెక్టులకే పరిమితం కాకుండా తమ వ్యాపార సామ్రాజ్యాల్లో పెద్ద ఎత్తున ఏఐని విస్తరిస్తున్నారని స్పష్టం చేశారు. టీసీఎస్ గ్లోబల్ మార్కెట్‌లో తన పట్టును ఎంత బలంగా నిలుపుకుందో ఈ గణాంకాలు నిరూపిస్తున్నాయి. ఏడాదికి 50 మిలియన్ డాలర్లకు పైగా ఆదాయాన్ని అందించే కంపెనీ అగ్రశ్రేణి 139 క్లయింట్లలో.. ఏకంగా 130 మంది తమ ఏఐ సేవల భాగస్వామిగా టీసీఎస్‌ను ఎంచుకున్నారని కృతివాసన్ ప్రకటించారు. 'ఏఐ సృష్టిస్తున్న అపారమైన అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ప్రపంచంలోనే అతిపెద్ద ఏఐ-నేతృత్వంలోని టెక్నాలజీ సర్వీసెస్ కంపెనీగా మారాలనే సాహసోపేతమైన లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. మౌలిక సదుపాయాలు నుంచి ఇంటెలిజెన్స్ వరకు ఫుల్ స్టాక్ ఏఐ సేవలను అందించడమే మా వ్యూహం' అని కృతివాసన్ చెప్పారు.

**మూడు రెట్లు పెరిగిన ఏఐ శ్రామిక శక్తి**

ఈ భారీ సాంకేతిక మార్పును తట్టుకునేందుకు వీలుగా టీసీఎస్ తన శ్రామిక శక్తిని దూకుడుగా సన్నద్ధం చేస్తోంది.




ప్రస్తుతం కంపెనీలో 2,70,000 మందికి పైగా ఉద్యోగులు అధునాతన ఏఐ నైపుణ్యాలను కలిగి ఉన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సంఖ్య ఏకంగా మూడు రెట్లు పెరగడం గమనార్హం.

**డిజిటల్ ప్రాజెక్టులు..**

గ్లోబల్ మార్కెటతోపాటు భారతదేశ డిజిటల్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంలో టీసీఎస్ అత్యంత కీలక పాత్ర పోషించిందని సీఈఓ హైలైట్ చేశారు. గవర్నమెంట్ ఇ-మార్కెట్ ప్లేస్: రూ. 5 లక్షల కోట్లకు పైగా ప్రభుత్వ కొనుగోళ్లతో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రభుత్వ ఇ-కామర్స్ మార్కెట్‌ప్లేస్‌గా దీనిని విస్తరించింది. ఎస్‌బీఐ యోనో 2.0: 10 భాషల్లో ఏకంగా 20 కోట్ల మంది వినియోగదారులకు అత్యంత వేగవంతమైన సేవలు అందించేలా దీనిని అప్‌గ్రేడ్ చేసింది. ఈ-పాస్‌పోర్ట్: కోటికి పైగా ఈ-పాస్‌పోర్ట్‌ల జారీతో పౌర సేవలను ఆధునీకరించింది. ఆర్‌బీఐ డేటా మేనేజ్‌మెంట్: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్థిక విశ్లేషణల కోసం 250 టీబీ డేటాను నిర్వహించగల అత్యాధునిక డేటా మేనేజ్మెంట్ సిస్టమ్‌ను నిర్మించింది.

# 600 మీటర్ల దూరం.. అందుకే జాబ్ రిజెక్ట్!

ఈ మధ్యకాలంలో ఉద్యోగ నియామక ప్రక్రియలో విచిత్రమైన సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. ఇందులో భాగంగానే ఒక ఉద్యోగ అభ్యర్థికి వచ్చిన రిజెక్షన్ మెయిల్ అందరి దృష్టిని ఆకర్షించింది. సాధారణంగా కంపెనీలు అభ్యర్థిని తిరస్కరించేటప్పుడు.. క్వాలిఫికేషన్, స్కిల్స్ వంటివి చూస్తాయి. తమకు అవసరమైన స్కిల్ ఉన్నవారిని ఎంపిక చేసుకుంటాయి. లేకుంటే రిజెక్ట్ చేస్తాయి. కానీ.. అభ్యర్థి పనిచేసిన పాత ఆఫీస్ 600 మీటర్ల దూరంలో ఉండటం వల్ల రిజెక్ట్ చేస్తున్నట్లు కంపెనీ మెయిల్ ద్వారా వెల్లడించింది. కంపెనీకి సంబంధించిన భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఈ కారణం చదివిన తరువాత చాలా మంది ఆశ్చర్యపోయారు. సాధారణంగా కంపెనీలలో గోప్యత అనేది ఉద్యోగి బాధ్యత. కాబట్టి దీనికి కొన్ని సెక్యూరిటీ పాలసీలు ఉంటాయి. కానీ.. కేవలం భౌగోళిక దూరం ఆధారంగా ఉద్యోగిని తిరస్కరించడం అనేది చాలా మందికి అర్థం కాని విషయం అయ్యింది. సోషల్ మీడియాలో ఈ పోస్ట్ వైరల్ అయిన తరువాత, చాలామంది వినియోగదారులు దీనిపై తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. కొందరు ఇది



పాతకాలపు ఆలోచన అని విమర్శించారు. నేటి డిజిటల్ ప్రపంచంలో సమాచారం ఎప్పుడైనా, ఎక్కడైనా చేరవచ్చు. కాబట్టి, కేవలం ఆఫీసుల మధ్య దూరం ఆధారంగా గోప్యత భంగం కలుగుతుందని భావించడం సరైనది కాదని అన్నారు.

## స్పోర్ట్స్

# కెప్టెన్‌గా ఫాతిమా సనా.. ఐదుగురికి తొలిసారి ప్రపంచకప్ ఛాన్స్!

పదో సీజన్ మహిళల పొట్టి వరల్డ్‌కప్ కోసం పాకిస్థాన్ క్రికెట్ బోర్డు స్క్వాడ్‌ను ప్రకటించింది. ముక్కోణపు సిరీస్‌ను, ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకొని ఫాతిమా సనా కెప్టెన్‌గా 15 మందితో కూడిన బృందాన్ని సెలెక్టర్లు ఎంపిక చేశారు. సీనియర్లతో పాటు ప్రతిభావంతులైన జూనియర్లకు ప్రాధాన్యమిచ్చారు. అంతేకాదు రిజర్వ్ ప్లేయర్లుగా ఏకంగా ఆరుగురిని పాక్ బోర్డు తీసుకుంది. వన్డే ప్రపంచకప్‌లో పాక్‌ను నడిపించిన ఫాతిమా సనా పొట్టి కప్‌లోనూ కెప్టెన్‌గా ఎంపికైంది. సీనియర్లు మునీబా అలీ, అలియా రియాజ్, సదియా ఇక్బాల్, దయానా బైగ్, తస్మియా రుబబ్, తుబ హసన్‌లకు స్క్వాడ్‌లో చోటు దక్కింది. అండర్ -19 క్రికెట్‌లో అదరగొట్టిన ఇమన్ ఫాతిమా, నటాలియా పర్వేజ్, రమీన్ షమీమ్, సైరా జుబీన్‌లు మొదటిసారి ప్రపంచకప్ ఆడబోతున్నారు. ఈ పదిహేను మంది పోను.. ఆరుగురు రిజర్వ్ ప్లేయర్లుగా ఎంపికయ్యారు.

**పాకిస్థాన్ స్క్వాడ్ :** ఫాతిమా సనా(కెప్టెన్), అలియా రియాజ్, అయేషా జఫర్, దయానా బైగ్, ఎమన్ ఫాతిమా, గుల్ ఫెరోజా, ఇరామ్ జవేద్, మునీబా అలీ(వికెట్ కీపర్), నష్రా సంధు, నటాలియా పర్వేజ్, రమీన్ షమీమ్, సడియా ఇక్బాల్, సైరా జబీన్, తస్మియా రుబబ, తుబ హసన్.

రిజర్వ్ ప్లేయర్లు -- అంబర్ కైనత్, మొమినా రియాసత్, సడాఫ్ షమాస్, సిద్రా అమిన్, సైయదా అరూబ్, ఉమే హనీ.

జూన్ 12 నుంచి ఇంగ్లండ్ వేదికగా టీ20 వరల్డ్‌కప్



మొదలవ్వనుంది. అంతకంటే ముందు ఐర్లాండ్, పాకిస్థాన్, వెస్టిండీస్ ముక్కోణపు సిరీస్‌లో తలపడనున్నాయి. ఈ మూడు జట్ల మధ్య డబ్లిన్‌లో మే 28 నుంచి జూన్ 4 వ తేదీ ఈ సిరీస్ జరుగనుంది. ప్రపంచకప్ లీగ్ దశ తొలి మ్యాచ్‌లో పాకిస్థాన్ జూన్ 14న భారత జట్టును ఢీకొట్టనుంది. జూన్ 17న దక్షిణాఫ్రికాతో, జూన్ 20 వ తేదీన బంగ్లాదేశ్‌తో, జూన్ 23న ఆస్ట్రేలియా, జూన్ 27వ తేదీన నెదర్లాండ్స్‌తో పాక్ తలపడనుంది.

### కొంప ముంచిన ఆకాశ్ సింగ్!.. ఐపీఎల్‌లో వాటిపై నిషేధం?



చెన్నై సూపర్ కింగ్స్‌తో మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ పేసర్ ఆకాశ్ మహరాజ్ సింగ్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. నాలుగు ఓవర్ల కోటా పూర్తి చేసిన ఈ లెఫ్టార్మ్ ఫాస్ట్ బౌలర్.. 26 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు కూల్చాడు. తన అద్భుత స్పెల్‌తో చెన్నై టాపార్డర్‌ను ఆకాశ్ సింగ్ కుదేలు చేశాడు. ఓపెనర్లు సంజూ శాంసన్ (20), రుతురాజ్ గైక్వాడ్ (13).. వన్‌డౌన్ బ్యాటర్ ఉర్విల్ పటేల్ (6)ను పెవిలియన్‌కు పంపి చెన్నైని నామమాత్రపు స్కోరు (187)కు పరిమితం చేయడంలో కీలక పాత్ర పోషించాడు. అయితే, కీలక వికెట్లు తీసిన సంతోషంలో ఆకాశ్ సింగ్ సెలబ్రేషన్స్ చేసుకున్న తీరు క్రీడా వర్గాల్లో చర్చకు దారితీసింది. "అక్కీ ఆన్ ఫైర్.. టీ20 మ్యాచ్‌లో వికెట్లు ఎలా తీయాలో ఆకాశ్‌కు తెలుసు" అని రాసి ఉన్న నోట్ చూపించాడు. ఇందుకు సంబంధించిన ఫొటోలు వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆకాశ్ సింగ్ చర్యపై విమర్శల వర్షం కురుస్తోంది. 'పేపర్ ట్రెండ్' మానుకుంటే మంచిదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా 2025లో సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్ అభిషేక్ శర్మ.. "ఇది ఆరెంజ్ ఆర్మీ కోసం" అంటూ తన విధ్వంసకర ఇన్నింగ్స్‌ను అభిమానులకు అంకితమిస్తూ నోట్ చూపించాడు. అప్పటి నుంచి ఈ ట్రెండ్ మొదలైంది. ఇక ఇటీవల ముంబై ఇండియన్స్ బౌలర్ రఘు శర్మ సైతం ఇదే తరహాలో నోట్ చూపిస్తూ సెలబ్రేట్ చేసుకున్నాడు. గత మ్యాచ్‌లో చెన్నై స్టార్ ఉర్విల్ పటేల్ సైతం.. "ఈ ఇన్నింగ్స్ నీకోసమే నాన్నా" అని రాసి ఉన్న పేపర్ చూపించాడు. తాజాగా ఆకాశ్ ఇదే పనిచేశాడు. ఈ నేపథ్యంలో సౌతాఫ్రికా దిగ్గజ పేసర్ డేల్ స్టెయిన్ ఘాటుగా స్పందించాడు. "ఈ పేపర్లను పక్కనపెట్టాల్సిన సమయం వచ్చింది. ఇకపై ఇదేమీ ట్రెండ్ కాబోదు. నిజం చెప్పాలంటే గతంలోనూ దీనిని ట్రెండ్‌గానూ ఎవరూ గుర్తించలేదు" అని ఎక్స్ వేదికగా తన అభిప్రాయాన్ని పంచుకున్నాడు. ఇక భారత మాజీ క్రికెటర్ అంబటి రాయుడు ఈఎస్‌పీఎన్‌క్రిక్‌ఇన్ఫోతో మాట్లాడుతూ.. "అతడి అభివ్యక్తి అది. అయితే, చాలా మందికి ఇది నచ్చలేదు. ఇదొక రకంగా సరదాగా.. అదే సమయంలో చెత్తగా ఉంది.

### త్వరలో భారత్-పాక్ టెస్ట్ సిరీస్..?



క్రికెట్ అభిమానులకు శుభవార్త. భారత్-పాక్ మధ్య టెస్ట్ మ్యాచ్‌లు మళ్లీ మొదలుకానున్నాయని ప్రచారం జరుగుతుంది. ఈ దిశగా ఐసీసీ అడుగులు వేస్తున్నట్లు తెలుస్తుంది. త్వరలో ఐసీసీ నిర్వహించబోయే కీలక సమావేశాల్లో ఈ అంశంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ భవిష్యత్ నిర్మాణంపై చర్చించేందుకు ఐసీసీ ఈ నెలాఖర్లో (మే 30, 31) అహ్మదాబాద్‌లో బోర్డు సమావేశాలు నిర్వహించనుంది. ఈ సమావేశాల్లో టెస్టు క్రికెట్ విస్తరణతో పాటు భారత్, పాక్ మధ్య ద్వైపాక్షిక టెస్టు సిరీస్ పునరుద్ధరణ అంశం ప్రధాన చర్చగా మారే అవకాశముంది. ఈ సమావేశాలకు బీసీసీఐ, పీసీబీ అధ్యక్షులు హాజరవుతారు. పీసీబీ చీఫ్ నక్వీ ఈ మీటింగ్‌కు వర్చువల్‌గా అటెండ్ అవుతాడని తెలుస్తుంది. కాగా, భారత్, పాక్ మధ్య మళ్లీ టెస్టు సిరీస్ జరగొచ్చన్న చర్చ ఇరు దేశాల క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి రేపుతోంది. ఇటీవల బంగ్లాదేశ్ పర్యటనలో నక్వీ మాట్లాడుతూ.. తదుపరి ఫ్యూచర్ టూర్స్ ప్రోగ్రామ్‌లో అన్ని దేశాలతో టెస్టులు ఆడేందుకు సిద్ధంగా ఉన్నామని వ్యాఖ్యానించారు. దీంతో భారత్‌తో టెస్టు సిరీస్‌పై ఊహాగానాలు మరింత పెరిగాయి. భారత్, పాక్ చివరిసారిగా 2007-08లో టెస్టు సిరీస్ ఆడాయి. ఆ తర్వాత రెండు దేశాల మధ్య రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ద్వైపాక్షిక టెస్టు క్రికెట్ పూర్తిగా నిలిచిపోయింది. ప్రస్తుతం ఐసీసీ సమావేశాల్లో దీనిపై ప్రత్యక్ష నిర్ణయం వచ్చే అవకాశం లేకపోయినా, భవిష్యత్ చర్చలకు ఇది బాటలు వేయొచ్చని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి.

**12 జట్లు**

టెస్టు క్రికెట్ భవిష్యత్‌పై అధ్యయనం చేసేందుకు ఐసీసీ గతేడాదే మాజీ న్యూజిలాండ్ క్రికెటర్ రోజర్ ట్వోస్ ఆధ్వర్యంలో ప్రత్యేక వర్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిటీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌ను ప్రస్తుతం ఉన్న 9 జట్ల నుంచి 12 జట్లకు విస్తరించాలని సూచించినట్లు సమాచారం. ఈ ప్రతిపాదనకు ఆమోదం లభిస్తే ఆఫ్ఘనిస్తాన్, జింబాబ్వే, ఐర్లాండ్ వంటి జట్లకు కూడా డబ్ల్యూటీసీలో చోటు దక్కే అవకాశం ఉంటుంది.

**ఒకే టెస్ట్‌తో సిరీస్**

ఈ సమావేశాల్లో ఒకే టెస్టుతో సిరీస్ నిర్వహించే ప్రతిపాదన కూడా చర్చకు వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రతి డబ్ల్యూటీసీ సిరీస్‌లో కనీసం రెండు టెస్టులు తప్పనిసరి. అయితే చిన్న క్రికెట్ బోర్డుల ఆర్థిక భారం తగ్గించేందుకు, మరిన్ని జట్లకు టెస్టు అవకాశాలు కల్పించేందుకు ఒకే టెస్టు సిరీస్ మోడల్‌పై ఐసీసీ ఆలోచిస్తున్నట్లు సమాచారం.

# కాక్టస్ పండును తినవచ్చు, సురక్షితమే..



దీన్ని కట్ చేయడంలో జాగ్రత్తలు పాటించాలి..



ముళ్లతో కప్పి ఉండే కాక్టస్ పండును చూసిన వెంటనే చాలామందికి దాన్ని తినాలనే ఆసక్తికంటే భయం ఎక్కువగా ఉంటుంది. కానీ సరైన విధంగా పట్టుకుని తొక్క తీస్తే ఈ పండు చాలా రుచికరంగా ఉండటమే కాకుండా ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో దీనిని ప్రిక్లీ పియర్ అని పిలుస్తారు. బయట భాగం గట్టిగా, ముళ్లతో ఉండినా లోపల భాగం మాత్రం తియ్యగా, రసంతో నిండుగా ఉంటుంది. వేసవిలో శరీరానికి చల్లదనాన్ని ఇవ్వడంలో కూడా ఈ పండు ఉపయోగపడుతుంది. కాక్టస్ పండ్లు ఆకుపచ్చ, పసుపు, గులాబీ, గాఢ ఊదా వంటి రంగుల్లో కనిపిస్తాయి. లోపలి గుజ్జు తేమగా ఉండి స్వల్ప తీపి రుచిని ఇస్తుంది. కొంతమంది దీనిని పుచ్చకాయ, బెర్రీల రుచుల మిశ్రమంలా ఉంటుందని చెబుతారు. ఇందులో చిన్న గింజలు ఉంటాయి. అవి తినడానికి సురక్షితమే. ఈ పండులో ఫైబర్, విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉండటంతో శరీరానికి పోషణ అందుతుంది.

**ఇలా కట్ చేయాలి..**

ఈ పండుపై ఉండే ముళ్లు మొక్కను రక్షించేందుకు సహజంగా ఏర్పడినవి. పెద్ద ముళ్లతో పాటు కంటికి సరిగ్గా కనిపించని చిన్న రోమాల్లాంటి గ్లోచిడ్స్ కూడా ఉంటాయి. ఇవి చర్మానికి అంటుకుని దురద లేదా అసౌకర్యాన్ని కలిగించవచ్చు. అందుకే పండును చేతులతో నేరుగా పట్టకుండా జాగ్రత్తగా హ్యాండిల్ చేయడం అవసరం. కాక్టస్ పండును కట్ చేయడానికి ముందుగా పదునైన కత్తి, గట్టి కటింగ్ బోర్డు, టాంగ్స్ లేదా మందమైన గ్లౌజులు, తొక్క తీసిన పండును పెట్టడానికి శుభ్రమైన బౌల్ సిద్ధంగా ఉంచుకోవాలి. గ్లౌజులు లేదా టాంగ్స్ ఉపయోగిస్తే ముళ్లు చేతికి గుచ్చుకునే ప్రమాదం తగ్గుతుంది. మొదట పండును టాంగ్స్ సహాయంతో పట్టుకుని నీటితో బాగా కడగాలి. పైభాగంలో ఉండే చిన్న ముళ్లు తొలగేలా మెల్లగా రుద్దాలి. తర్వాత కత్తితో పండు పై భాగం, కింది భాగాన్ని కోయాలి. ఆపై పొడవుగా ఒక చిన్న కోత పెట్టాలి. కోత చాలా లోతుగా కాకుండా కేవలం తొక్క వరకు మాత్రమే ఉండాలి. తర్వాత కత్తి అంచు లేదా వేళ్ల సహాయంతో తొక్కను మెల్లగా పైకి లేపి తొలగించాలి. సాధారణంగా తొక్క ఒకటి లేదా రెండు ముక్కలుగా సులభంగా ఊడిపోతుంది. తొక్కను వెంటనే పారేయాలి. ఎందుకంటే దానిపై ఇంకా చిన్న ముళ్లు ఉండే అవకాశం ఉంటుంది. తొక్క పూర్తిగా తీసిన తర్వాత పండును చేతులతో సురక్షితంగా పట్టుకోవచ్చు.

**అనేక రకాలుగా తీసుకోవచ్చు..**

తొక్క తీసిన కాక్టస్ పండును నేరుగా ముక్కలుగా కట్ చేసి తినవచ్చు. ఇది జ్యూసీగా, చల్లదనాన్ని ఇచ్చేలా ఉండటంతో వేసవిలో మంచి స్నాక్‌గా ఉపయోగపడుతుంది. గింజలు కూడా తినవచ్చు. ఈ పండును ఫ్రూట్ సలాడ్లలో కలిపి తినొచ్చు. సిట్రస్ పండ్లు, బెర్రీలు లేదా మెలన్‌తో కలిపితే మంచి రుచి వస్తుంది. అలాగే స్మూతీలు, జ్యూసుల్లో కూడా ఉపయోగించవచ్చు. మరింత మృదువైన టెక్స్చర్ కావాలనుకుంటే గింజలను వడకట్టుకోవచ్చు. కాక్టస్ పండుతో సోర్బెట్, పాప్సికల్స్, తేలికపాటి పుడ్డింగ్స్ వంటి చల్లని డెజర్ట్స్ కూడా తయారు చేస్తారు. కొన్ని దేశాల్లో దీన్ని సాల్సా వంటి కారంగా ఉండే వంటకాలతో కూడా వడ్డిస్తారు. దీని స్వల్ప తీపి రుచి మసాలా రుచిని సమతుల్యం చేస్తుంది. కాక్టస్ పండ్లు కొనేటప్పుడు గట్టిగా ఉండి స్వల్పంగా మెత్తగా అనిపించే వాటిని ఎంచుకోవాలి. చాలా గట్టిగా ఉంటే ఇంకా పండని అవకాశం ఉంది. మరీ ఎక్కువగా మెత్తబడితే పండు పాతదై ఉండొచ్చు. తొక్క తీసిన తర్వాత ఫ్రిజ్‌లో గాలి చొరబడని డబ్బాలో పెట్టి రెండు రోజుల్లోపు తింటే తాజాగా ఉంటుంది. మొదట చూసినప్పుడు భయపెట్టేలా కనిపించినా సరైన విధంగా కట్ చేసి తింటే కాక్టస్ పండు ఎంతో రుచికరమైనది. పోషకాలు, తేమ, చల్లదనాన్ని అందించే ఈ ప్రత్యేక పండును ఆహారంలో చేర్చుకోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు.

### శరీరంలోని కొలెస్ట్రాల్ స్థాయిలను గణనీయంగా తగ్గించే అవకాడో..

# రోజూ తీసుకుంటే ఎంతో మంచిది..



మనం ఆహారంగా తీసుకోదగిన పండ్లల్లో అవకాడో ఒకటి. ప్రస్తుతం అవకాడో ఫిట్‌నెస్ ప్రియులు ఎక్కువగా తీసుకుంటున్న ఆహారాల్లో ఒకటిగా మారింది. సలాడ్లు, స్మూతీలు, టోస్ట్‌లు, గ్వాకమోలే వంటి వంటకాలలో దీనిని విరివిగా ఉపయోగిస్తున్నారు. తక్కువ చక్కెరలు, మంచి కొవ్వులు అధికంగా ఉండటంతో అవకాడోకు ప్రత్యేక స్థానం ఏర్పడింది. మృదువైన వెన్నలాంటి గుజ్జుతో ఉండే ఈ పండు ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలు అందిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా రెండు వారాల పాటు ప్రతిరోజూ అవకాడో తింటే శరీరంలో కొన్ని మార్పులు కనిపిస్తాయని పేర్కొంటున్నారు.

**కొలెస్ట్రాల్ తగ్గేందుకు..**

అవకాడోలో మోనో అన్‌శాచురేటెడ్ ఫ్యాట్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్‌గా భావించే ఎల్‌డీఎల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. దీంతో గుండె ఆరోగ్యం మెరుగుపడే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ పండులో ఫైబర్‌తోపాటు కొన్ని మొక్కల సమ్మేళనాలు కూడా ఉంటాయి. ఇవి పేగుల్లో మంచి బ్యాక్టీరియా పెరుగుదలకు సహాయపడతాయి. ఫలితంగా జీర్ణక్రియ మెరుగుపడి జీర్ణాశయ ఆరోగ్యానికి మేలు జరుగుతుందని పేర్కొంటున్నారు. అవకాడోలో పొటాషియం కూడా అధికంగా ఉంటుంది. ఇది రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. అలాగే గుండె సంబంధిత ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా ఉపయోగపడుతుందని చెబుతున్నారు. అంతేకాకుండా ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వుల కలయిక వల్ల అవకాడో ఎక్కువసేపు కడుపు నిండిన భావనను కలిగిస్తుంది. దీంతో అతిగా తినే అలవాటు తగ్గే అవకాశం ఉంటుంది. రోజుకు అర అవకాడో నుంచి ఒక అవకాడో వరకు తీసుకోవడం చాలామందికి సరిపోతుందని సూచిస్తున్నారు.

**యాంటీ ఆక్సిడెంట్లు అధికం..**

వెన్న, మయోనైస్ లేదా ఎక్కువ క్రీమ్ ఉండే డ్రెస్సింగ్‌లకు బదులుగా అవకాడోను ఉపయోగిస్తే ఆహారంలోని కొవ్వుల నాణ్యత మెరుగుపడుతుందని కూడా నిపుణులు చెబుతున్నారు. అవకాడోలో గ్లుటాథయోన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు ఉండటం వల్ల కాలేయం హానికర పదార్థాలను బయటకు పంపడంలో సహాయపడుతుందని పేర్కొంటున్నారు. అలాగే ఇందులో విటమిన్ సి, బి9, ఇ లాంటి యాంటీ ఆక్సిడెంట్ విటమిన్లు ఉండటంతో శరీర కణాలను రక్షించడంలో ఉపయోగపడతాయి. కాలేయ ఆరోగ్యానికి మద్దతు ఇచ్చే ఖనిజాలు కూడా ఇందులో లభిస్తాయని చెబుతున్నారు. ఒలెక్ యాసిడ్ అనే ఆరోగ్యకరమైన కొవ్వు కూడా అవకాడోలో ఉండటం వల్ల శరీరానికి మంచి శక్తిని అందించడంలో ఇది సహాయపడుతుంది. సరైన మోతాదులో తీసుకుంటే అవకాడో సమతుల ఆహారంలో ఆరోగ్యకరమైన ఎంపికగా ఉపయోగపడుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

## చియా సీడ్స్, గుమ్మడి విత్తనాలు వంటి సీడ్స్‌ను రోజులో ఏ సమయంలో ఎలా తీసుకుంటే మేలు చేస్తాయి?

నేటి తరుణంలో ఆరోగ్యం మీద అవగాహన రావడంతో చాలా మంది విత్తనాలను ఆహారంగా తీసుకుంటున్నారు. విత్తనాలు చాలా మందికి ఇప్పుడు ఆరోగ్యకరమైన ఆహారంలో ముఖ్యమైన భాగంగా మారిపోయాయని చెప్పవచ్చు. చియా సీడ్స్ నుంచి గుమ్మడి గింజలు, సన్‌ఫ్లవర్ సీడ్స్ వరకు చాలామంది రోజూ తీసుకుంటున్నారు. వీటిలో ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటంతో శరీరానికి ఎన్నో ప్రయోజనాలు అందుతాయి. అయితే వీటిని సరైన సమయంలో, సరైన విధంగా తీసుకోకపోతే పూర్తి పోషకాలు శరీరానికి అందకపోవచ్చని నిపుణులు చెబుతున్నారు. చిన్న చిన్న మార్పులతోనే వీటి ప్రయోజనాలను మరింతగా పొందవచ్చని సూచిస్తున్నారు. ఏయే విత్తనాలను ఎలా, ఎప్పుడు తీసుకోవాలో వారు వివరిస్తున్నారు. చియా సీడ్స్ ప్రస్తుతం ఎక్కువగా ఉపయోగిస్తున్న విత్తనాలలో ఒకటి. ఇవి ఉదయం ఖాళీ కడుపుతో తీసుకుంటే మంచి ఫలితం ఉంటుందని చెబుతున్నారు. ఇందులో ఉండే సొల్యూబుల్ ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అలాగే రోజంతా రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచడంలో కూడా ఉపయోగపడుతుంది. ఇది శరీరంలో శక్తి సమతుల్యతకు, కొవ్వు తగ్గించుకోవడానికి తోడ్పడుతుంది. అలాగే చియా సీడ్స్‌ను నేరుగా తినడం కంటే ముందుగా నీటిలో నానబెట్టడం మంచిదని సూచిస్తున్నారు. ఒక గ్లాస్ నీటిలో వేసి కొంతసేపు ఉంచితే అవి విస్తరించి జెల్‌లా మారతాయి. ఆ తరువాత అదే నీటితో కలిసి తీసుకుంటే శరీరం పోషకాలను సులభంగా గ్రహిస్తుంది.



**పొద్దు తిరుగుడు, గుమ్మడి విత్తనాలు..**

సన్‌ఫ్లవర్, గుమ్మడి విత్తనాలను చాలామంది ఎప్పుడైనా స్నాక్‌లా తింటుంటారు. అయితే మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల మధ్య తీసుకుంటే మరింత ప్రయోజనం ఉంటుందని చెబుతున్నారు. మధ్యాహ్న భోజనంలో ఉండే మంచి కొవ్వులు ఈ విత్తనాల్లోని జింక్, మెగ్నీషియం వంటి ఖనిజాలను శరీరం బాగా గ్రహించేందుకు సహాయపడతాయి. ఈ విత్తనాలను తేలికగా డ్రై రోస్ట్ చేసి తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. ఇలా చేయడం వల్ల వాటి పోషకాలు నిల్వ ఉండటమే కాకుండా జీర్ణం కావడం కూడా సులభమవుతుంది. అదే విధంగా బేసిల్ సీడ్స్ వేసవిలో ఎక్కువగా ఉపయోగపడే విత్తనాలుగా భావిస్తారు. ఇవి శరీరానికి చల్లదనాన్ని అందించడంలో సహాయపడతాయి. మధ్యాహ్న భోజనం ముందు, అంటే మిడ్ మార్నింగ్ సమయంలో తీసుకుంటే శరీరం పోషకాలను బాగా గ్రహిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

**బేసిల్ సీడ్స్..**

వేసవిలో శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచడంలో కూడా బేసిల్ సీడ్స్ కూడా ఉపయోగపడతాయి. ఈ సీడ్స్‌ను కూడా ముందుగా నీటిలో నానబెట్టాలి. అవి విస్తరించిన తర్వాత తీసుకుంటే చల్లదనంతో పాటు హైడ్రేషన్ ప్రయోజనాలు మరింతగా అందుతాయి. విత్తనాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేసినా, వాటిని ఎలా తీసుకుంటున్నామన్నది కూడా అంతే ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. సరైన సమయంలో తీసుకోవడం, కొన్ని విత్తనాలను నానబెట్టి తీసుకోవడం వల్ల ఫైబర్, ఖనిజాలు, ఆరోగ్యకరమైన కొవ్వులు శరీరానికి మెరుగ్గా అందుతాయి. కాబట్టి ఇకపై విత్తనాలను తీసుకునేటప్పుడు సమయం, విధానం రెండింటినీ గమనిస్తే ఆరోగ్య ప్రయోజనాలు మరింతగా పొందవచ్చని వారు సూచిస్తున్నారు.

# వ్యూస్ కోసం దిగజారొద్దు.. జర్నలిస్టులకు మాళవిక మోహనన్ స్ట్రాంగ్ కౌంటర్



ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో తమిళనాడు మీడియా ప్రతినిధులు అడిగిన కొన్ని ప్రశ్నలపై ప్రముఖ నటి మాళవిక మోహనన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. నిన్న తాను ఒక కార్యక్రమానికి హాజరయ్యానని, తమిళనాడు మీడియా మరియు జర్నలిస్టుల పట్ల తనకు ఎంతో గౌరవం ఉన్నప్పటికీ, అక్కడ జరిగిన సంఘటన తనను బాధించిందని ఆమె పేర్కొన్నారు. నిన్నటి ఈవెంట్‌లో ఒకరిద్దరు రిపోర్టర్లు పదే పదే చాలా అసభ్యకరమైన, అనవసరమైన ప్రశ్నలు అడిగారని, కేవలం వ్యూస్, పాపులారిటీ కోసమే వారు అలా ప్రవర్తించారని ఆమె మండిపడ్డారు. దళపతి విజయ్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, ఆయనతో తనకు గత ఏడేళ్లుగా మంచి పరిచయం ఉందని మరియు ఆయనపై తనకు ఎంతో గౌరవం ఉందని తెలిపారు. విజయ్‌ని తన మంచి స్నేహితుడిగా భావించడానికి తాను ఎప్పుడూ గర్వపడతానని, ఒక నటుడిగా మరియు వ్యక్తిగా ఆయన సాధించిన ఎదుగుదలను, అద్భుతమైన ప్రయాణాన్ని పక్కనుండి చూడటం ఒక గొప్ప అనుభూతి అని ఆమె వివరించారు. భవిష్యత్తులో జరిగే ప్రెస్ మీట్‌లలో లేదా మీడియా సమావేశాలలో సెలబ్రిటీలను గౌరవిస్తూ, మర్యాదపూర్వకంగా ప్రశ్నలు అడగాలని, అది అందరికీ మంచిదని ఆమె కోరారు.

# అనుపమ పరమేశ్వరన్ 'మరీచిక' ట్రైలర్ విడుదల

టాలీవుడ్ యంగ్ హీరో విరాజ్ అశ్విన్, స్టార్ హీరోయిన్లు రెజీనా కాసాండ్రా, అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'మరీచిక' సతీష్ కాసెట్టి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా చిలకా ప్రొడక్షన్ బ్యానర్‌పై రాజీవ్ చిలకా, మేఘన చిలకా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. సస్పెన్స్, లవ్ అండ్ ఎమోషనల్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా అధికారిక ట్రైలర్‌ను చిత్ర యూనిట్ తాజాగా విడుదల చేసింది. ఈ సినిమా ట్రైలర్ చూస్తుంటే.. సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది. ఈ చిత్రానికి 'మ్యూజికల్ మాస్ట్రో' ఇళయరాజా సంగీతం అందించడం విశేషం. ఆయన అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ట్రైలర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అద్భుతమైన కథాంశంతో వస్తున్న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా మే 29న థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.




# కెనీషాతో బ్రేకప్.. మీడియా ముందు జయం రవి కన్నీటి పర్యంతం!




తమిళ స్టార్ హీరో జయం రవి (రవి మోహన్) మీడియా ముందు కన్నీళ్లుపెట్టుకున్నాడు. అతడి ప్రియురాలు పాప్ సింగర్ కెనీషా ఫ్రాన్సిస్ రవితో ఉన్న రిలేషన్‌షిప్‌కి బ్రేకప్ చెబుతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. జయం రవి తన భార్య ఆర్తితో విడాకులు ప్రకటించిన రోజు నుంచి, ఈ విడాకులకు కెనీషానే కారణమంటూ సోషల్ మీడియాలో విపరీతమైన ట్రోలింగ్, ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలోనే కెనీషాకు సోషల్ మీడియాలో తీవ్రమైన వేధింపులు, చంపేస్తామనే హత్యా బెదిరింపులు కూడా వచ్చాయి. ఈ వివాదాలపై తాజాగా కెనీషా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఒక సుదీర్ఘమైన ఎమోషనల్ పోస్ట్ పెడుతూ, తాను ఈ వ్యవహారం నుంచి పూర్తిగా తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. ఈ వివాదాలు, ట్రోలింగ్స్ వల్ల తీవ్ర మనస్తాపానికి గురయ్యానని, అందుకే చెన్నై నగరాన్ని సైతం వదిలి వెళ్లిపోతున్నట్లు ఆమె తెలిపారు. ఈ పరిణామాల నేపథ్యంలో మీడియా ముందుకు వచ్చిన నటుడు జయం రవి తీవ్ర ఆవేదనకు లోనై, కన్నీటి పర్యంతమయ్యారు. జయం రవి మీడియా ముందు మాట్లాడుతూ.. ఒక ప్రముఖ నటి తన జీవితాన్ని నాశనం చేసిందని ఆరోపించిన ఆయన, గత 14 ఏళ్ల వైవాహిక జీవితంలో తాను ఒక బానిసలా బతికానని ఆవేదన చెందారు. తాను కష్టపడి సంపాదించిన కోట్లాది రూపాయల ఆస్తులన్నీ భార్య వైపు వాళ్లే ఉంచుకున్నారని, కనీసం తన పేరు మీద ఒక్క బ్యాంక్ అకౌంట్ కూడా లేకుండా చేశారని, ప్రస్తుతం తాను అద్దె ఇంట్లో ఉంటున్నానని తెలిపారు. ఇల్లు వదిలి వచ్చేటప్పుడు తన చేతిలో ఏమీ లేదని, తన డబ్బును తన ఇష్టప్రకారం ఖర్చు పెట్టుకునే స్వేచ్ఛ కూడా ఇవ్వలేదని చెప్పారు. సినిమాల్లో మహిళల హక్కుల గురించి మాట్లాడే తాను, మహిళలను ఎప్పుడూ తప్పుగా మాట్లాడనని, 45 ఏళ్ల వయసులో తాను అమ్మాయిల వెంట పడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. తనను అర్థం చేసుకుని తోడుగా నిలిచిన కెనీషాను కూడా టార్గెట్ చేసి పంపించేశారని మండిపడ్డారు. తన పిల్లల కోసమే తాను ఇన్నాళ్లూ బతికానని, కానీ ఇప్పుడు కనీసం తన పిల్లలను కూడా చూడనివ్వడం లేదని, వాళ్లను స్కూలుకు కూడా సెక్యూరిటీ గార్డుల కాపలాతో పంపుతున్నారని రవి మోహన్ తీవ్ర ఆక్రోశం వెళ్లగక్కారు. నా పిల్లల భవిష్యత్తు కోసమే ఇన్నాళ్లూ నోరు మూసుకుని ఉన్నానని.. నా వ్యక్తిగత జీవితాన్ని సరిదిద్దుకున్నాకే మళ్లీ సినిమాల్లోకి వస్తానని, అంతవరకు తాను నటించనని రవి స్పష్టం చేశారు. చివరగా రవి మోహన్ మాట్లాడుతూ 'మూడక్షరాల ఇడ్లీ నటి' ఒకరు తన జీవితాన్ని నాశనం చేశారని, ఆమె ఎన్ని కుటుంబాలను కూల్చిందో తాను చెప్పాలా అని నిలదీశారు. తాను అనుకుంటే ఒకే రోజులో విడాకులు తీసుకునేవాడినని, కానీ తన పిల్లల కోసమే ఇన్నాళ్లూ మౌనంగా ఉన్నానని, ఇకపై నన్ను రెచ్చగొట్టవద్దంటూ మండిపడ్డారు. రవి మోహన్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ పరిశ్రమలో తీవ్ర దుమారం రేపుతుండగా, ఆ 'మూడక్షరాల నటి' ఎవరనే దానిపై సర్వత్రా చర్చ నడుస్తోంది.

# స్టార్ హీరో సినిమాలో ఎన్టీఆర్ గెస్ట్ రోల్.. ఊహించని పాత్రలో తారక్..!!



ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్ డ్రాగన్ (ప్రచారంలో ఉన్న పేరు) చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. డైరెక్టర్ ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న ఈ మూవీపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇందులో కన్నడ భామ రుక్మిణి వసంత్ కథానాయికగా నటిస్తుంది. కొన్ని నెలలుగా ఈ మూవీ షూటింగ్ వేగంగా జరుగుతుంది. సాధారణంగా టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద ఎప్పుడూ రకరకాల గాసిప్స్, క్రేజీ కాంబినేషన్ల గురించిన వార్తలు చక్కర్లు కొడుతూనే ఉంటాయి. తాజాగా ఫిల్మ్‌నగర్ వర్గాల్లో విపరీతమైన హల్‌చల్ సృష్టిస్తున్న ఒక వార్త నందమూరి, మాస్ మహారాజా అభిమానులను ఎంతగానో ఆకర్షిస్తోంది. మాస్ మహారాజా రవితేజ హీరోగా, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ఇరుముడి' (=77). ఇదివరకే ఈ మూవీపై అధికారిక ప్రకటన వచ్చింది. ఈ సినిమాకు సంబంధించిన ఒక సంచలన గాసిప్ ఇప్పుడు టాలీవుడ్ 'గాసిప్ గ్యారేజ్'లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రంలో అత్యంత కీలకమైన, దైవిక ప్రాధాన్యత కలిగిన అయ్యప్ప స్వామి పాత్రలో గ్లోబల్ స్టార్ జూనియర్ ఎన్టీఆర్ (చీ=) గెస్ట్ రోల్‌లో కనిపించబోతున్నారనే ప్రచారం గట్టిగా సాగుతోంది. అయితే దీనిపై ఇప్పటివరకు క్లారిటీ రాలేదు. కానీ ఫిల్మ్ వర్గాల్లో ఈ న్యూస్ మాత్రం హల్చల్ చేస్తుంది. ఇటీవలే విడుదలైన 'ఇరుముడి' ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచేసింది. రవితేజ ఇందులో నల్లటి దుస్తులు ధరించి, మెడలో మాల వేసుకుని భక్తిభావంతో ఉన్న ఒక పవర్‌ఫుల్ అయ్యప్ప స్వామి భక్తుడిగా (స్వామి మాలధారిగా) కనిపిస్తున్నారు. ఒకవైపు భక్తి, మరోవైపు తండ్రి-కూతుళ్ల మధ్య సాగే ఎమోషనల్ డ్రామాగా ఈ సినిమాను శివ నిర్వాణ మలుస్తున్నారు. కథ ప్రకారం చిత్రంలో ఒక ప్రత్యేక సన్నివేశంలో గానీ, లేదా క్లైమాక్స్ వైపు వెళ్లే క్రమంలో గానీ అయ్యప్ప స్వామి వారి దివ్య రూపం లేదా దైవికమైన ఎపిసోడ్ ఒకటి ఉంటుందని తెలుస్తోంది. ఈ పాత్ర కేవలం కొన్ని నిమిషాల పాటే ఉన్నప్పటికీ, సినిమా మొత్తాన్ని ఒక ఊపు ఊపేసేలా ఎంతో పవర్‌ఫుల్‌గా డిజైన్ చేశారట. ఈ పాత్రకు ఎవరైనా పెద్ద స్టార్ హీరో అయితేనే న్యాయం జరుగుతుందని భావించిన చిత్ర బృందం, జూనియర్ ఎన్టీఆర్ పేరును పరిశీలిస్తున్నట్లు ఇండస్ట్రీ టాక్. ఎన్టీఆర్ గతంలో నిజ జీవితంలో కూడా పలుమార్లు అయ్యప్ప దీక్షను ఎంతో నిష్ఠతో తీసుకున్నారు. ఆయన గంభీరమైన వాయిస్, నటనలోని దైవిక తీక్షణత ఈ పాత్రకు నూటికి నూరు పాళ్ళు సరిపోతాయని దర్శకుడు భావిస్తున్నట్లు సమాచారం. రవితేజ , జూనియర్ ఎన్టీఆర్ మధ్య రియల్ లైఫ్‌లో ఎంతో మంచి స్నేహబంధం ఉంది. ఒకవేళ ఈ వార్త కనుక నిజమైతే, వీరిద్దరి కాంబినేషన్‌ను ఒకే స్క్రీన్‌పై చూడటం అభిమానులకు పూనకాలు తెప్పించే విషయమే అవుతుంది. ముఖ్యంగా మైత్రీ మూవీ మేకర్స్ సంస్థతో ఎన్టీఆర్‌కు ఉన్న సాన్నిహిత్యం కారణంగా ఈ క్యామియో రోల్ నిజమయ్యే అవకాశాలు ఉన్నాయంటూ నెటిజన్లు లెక్కలు వేస్తున్నారు. ఈ క్రేజీ కాంబినేషన్, 'అయ్యప్ప' పాత్రపై చిత్ర యూనిట్ గానీ, లేదా జూనియర్ ఎన్టీఆర్ టీమ్ గానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఇది కేవలం చర్చల దశలోనే ఉందా లేదా కేవలం పుకారు మాత్రమేనా అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే.



# జస్ట్ వావ్.. 'పెద్ది' ట్రైలర్‌పై మెగాస్టార్ చిరంజీవి ప్రశంసలు

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సన కాంబినేషన్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం 'పెద్ది' (గ్రావసంఅ). ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. కాగా, ఈ చిత్రం మే 18న విడుదల కాబోతున్న ట్రైలర్‌ను మెగాస్టార్ చిరంజీవి ముందే వీక్షించారు. ట్రైలర్ చూసిన అనంతరం ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, చిత్ర యూనిట్‌పై ప్రశంసల జల్లు కురిపించారు. ట్రైలర్ గురించి చిరంజీవి ట్వీట్ చేస్తూ.. ఇప్పుడే పెద్ది ట్రైలర్ చూశాను, జస్ట్ వావ్ అంతే! 3 నిమిషాల పాటు సాగిన ఈ ట్రైలర్ ప్యూర్ పవర్ ప్యాక్డ్‌గా ఉంది. చరణ్, బుచ్చిబాబు, రెహమాన్.. ఇలా ఒక్కొక్కరు తమ బెస్ట్ అవుట్‌పుట్ ఇచ్చారు. అందరూ కలిసి బాక్సాఫీస్‌ను రఫ్ఫాడించేశారు. ఈ సినిమా గురించి మనం ఎంత ఊహించుకున్నా, ఈ ట్రైలర్ దాన్ని మించి ఉంటుంది. ఇందులో ఎమోషన్, ఎలివేషన్, మ్యాడ్నెస్ అన్నీ నెక్స్ట్ లెవెల్‌లో ఉన్నాయి అని చిరు కొనియాడారు. ఎప్పటికప్పుడు తన సినిమాలకు లేదా చరణ్ సినిమాలకు సంబంధించిన ఆసక్తికర విషయాలను లీక్ చేస్తూ అభిమానులను అలరించే చిరంజీవి, ఈసారి కూడా తన అలవాటును రిపీట్ చేశారు. "చాలా రోజులయ్యింది మీకు 'చిరు లీక్స్' ఇచ్చి" అంటూ సరదాగా వ్యాఖ్యానిస్తూ, పెద్ది ట్రైలర్‌లోని ఒక పవర్‌ఫుల్ డైలాగ్‌ను ఆయన లీక్ చేశారు. "మీరందరూ నేను ఆడానని అనుకుంటున్నారు... నేను పోరాడాను సారు.. అంటూ ట్రైలర్‌లోని ఈ డైలాగ్ ఎంతో అద్భుతంగా ఉందంటూ మెగాస్టార్ ప్రశంసించారు. ఈ క్రమంలోనే దర్శకుడు బుచ్చిబాబుకు క్షమాపణలు చెబుతూ.. "సారీ బుచ్చిబాబు.. ట్రైలర్ చూశాక కంట్రోల్ తప్పి లీక్ చేయాల్సి వచ్చింది" అంటూ చిరంజీవి చమత్కరించారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, వృద్ధి సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం యొక్క ట్రైలర్ మే 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. మెగాస్టార్ స్వయంగా ఇచ్చిన ఈ రివ్యూతో మెగా అభిమానుల్లో, సినీ ప్రేక్షకుల్లో 'పెద్ది' ట్రైలర్‌పై అంచనాలు ఆకాశాన్ని తాకాయి.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s SAI KRISHNA PUBLICATIONS, Owned by M/s SAI KRISHNA PUBLICATIONS, Printed at – Sree Seshasai Enterprises, Plot No.98/1, Co-operative Industrial Estate, IDA Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District, Telangana. Published at H.No.3-5-182, Kotagally, Ushaprasad Multiplex back side, Nizambad District-503001, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2010/35558 Phone No. 9440231967